నమస్తే తెలంగాణ
కరీంనగర్
3 | కరీంనగర్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 | KARIMNAGAR

బదిలీ కార్యదర్శిది తప్పే!

- జమ్మికుంట ఎంపీడీవో, ఎంపీవోల సమాధానం
- 'కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది' కథనానికి స్పందన

జమ్మికుంట, డిసెంబర్19 : 'కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది' శీర్షికన గురువారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనం చర్చనీయాంశమైంది. ఓ అర్జీదారు ఆర్టీఐ ద్వారా అధికారులను సమాచారం కోరితే, పంచాయతీ విధుల్లో ఉండే కార్యదర్శి కాకుండా బదిలీ అయిన కార్యదర్శి సమాధానం ఇవ్వడంపై సర్వత్రా చర్చ జరిగింది. దీనిపై ఎంపీడీవో భీమేశ్, ఎంపీవో వెంకటేశ్వర్లు స్పందించారు. ఆర్టీఐ అర్జీదారుడికి నాగంపేట గ్రామ పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి అంకూస్ సమాచారం ఇవ్వాల్సి ఉండగా.. గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్రీనివాస్ సమాధానం ఇవ్వడం తప్పేనని స్పష్టం చేశారు. అయితే ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై చర్యలు తీసుకుంటున్నారా..? అని 'నమస్తే' ప్రశ్నిస్తే అదేం పెద్ద సమస్య కాదంటూ దాటవేసే సమాధానం చెప్పడం విమర్శలకు తావిస్తున్నది. అయితే కార్యదర్శులపై క్రమ'శిక్ష'ణ చర్యలు తీసుకునేందుకు వెనుకడుగు వేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా, ఆర్టీఐ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు సంబంధించిన ఖర్చులు కార్యదర్శే భరిస్తాడని ఎంపీవో చెప్పారు. అయితే నాగంపేట జీపీపై ఆర్టీఐ దరఖాస్తు చేసిన అర్జీదారుడికి ఆర్నెళ్లుగా ఎందుకు సమాచారం ఇవ్వడం లేదన్నదే ప్రశ్నలా మిగిలింది.

పెద్దాపూర్ గురుకులంలో భయం భయం

యశ్విత్ కుడి కాలు, కుడి అరచేతిపై ఉన్న కాట్లు

కోరుట్లలో చికిత్స పొందుతున్న బోడ యశ్విత్

ఏదీ పర్యవేక్షణ?

- వరుస ఘటనలతో కలకలం
- ఐదు నెలల క్రితం ఇద్దరు విద్యార్థుల మృతి.. నలుగురికి అస్వస్థత
- ఇప్పటికీ కారణాలపై స్పష్టత కరువు
- తాజాగా, మరో ఇద్దరు పిల్లలకు పాముకాటు!
- కోరుట్ల దవాఖానల్లో చికిత్స
- ఘటనలు జరిగినప్పుడే హడావుడి.. ఆ తర్వాత షరా మామూలే
- తల్లిదండ్రుల ఆందోళన
- ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మారుతీనగర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అత్యంత ఘన చరిత్ర కలిగిన పెద్దాపూర్ గురుకులంలో ఇప్పుడు విద్యార్థులకు భరోసా కరువవుతున్నది. వరుస ఘటనలతో భయాందోళన వాతావరణం ఏర్పడింది. ఐదు నెలల క్రితం ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, మరో నలుగురు చావు అంచులదాకా వెళ్లడం కలకలం రేపింది. అప్పుడు పాముకాటు వల్లేననే అనుమానాలు వ్యక్తమైనా.. ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ కారణాలను వెల్లడించలేదు. తాజాగా, మరో ఇద్దరు పాముకాటుతో అస్వస్థత చెందగా, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురుకులంలో అసలేం జరుగుతోందని, పిల్లలను పంపిస్తున్నది చదివించడానికా.. లేక చంపుకోవడానికా.. అని ప్రశ్నిస్తున్నారు.

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 19: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యంత ఘనమైన చరిత్ర కలిగి ఉన్నది. 1983లో దీనిని ఏర్పాటు చేయగా, కాలగమనంలో జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన కొనసాగుతుండగా, ఈ విద్యాలయం 40 ఏండ్ల కాలంలో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దింది. అలాంటి ఈ గురుకులంలో భయాందోళన పరిస్థితి నెలకొన్నది. గత జూలై 26న ఎనిమిదో తరగతి విద్యార్థి రాజారపు గణాధిత్య(13) మృతి చెందగా, అస్వస్థతకు గురైన మరో ఇద్దరు విద్యార్థులు చికిత్స తర్వాత కోలుకున్నారు. ఆగస్టు 9న 6వ తరగతి విద్యార్థి ఎడ్మల అనిరుధ్(11)మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, విద్యార్థుల మృతికి, అస్వస్థతకు గల కారణాలపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. అప్పుడు పాముకాటు వల్లే పిల్లలు చనిపోయారనే అనుమానాలు వ్యక్తం కాగా, తాజాగా మరో ఇద్దరు విద్యార్థులు పాముకాటు బారిన పడడం కలకలం రేపింది.

కోరుట్లలో చికిత్స పొందుతున్న ఓంకార్ అఖిల్, మణికట్టుపై ఉన్న కాట్లు

మరో ఇద్దరికి పాముకాటు!

గురుకులంలో మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థత చెందారు. బుధవారం 8వ తరగతి విద్యార్థి ఓంకార్ అఖిల్, గురువారం 8వ తరగతి విద్యార్థి బోడ యశ్విత్ అస్వస్థతకు గురయ్యారు. అఖిల్‌కు కుడిచేతి మణికట్టుపై, యశ్విత్‌కు కుడి అరచేయి, కుడికాలిపై పాముకాట్లు గుర్తించారు. వీరిద్దరికీ కోరుట్ల లోని వేర్వేరు ప్రైవేట్ దవాఖానల్లో యాంటీ వీనమ్ ఇంజక్షన్ ఇచ్చి చికిత్స అందిస్తున్నారు. ఈ ఇద్దరు పిల్లలు కూడా ఒకే గదిలో నిద్రించిన సమయంలో పాముకాటుకు గురయ్యారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థుల వద్దకు డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు విషపురుగు కాటు వల్ల అస్వస్థతకు గురయ్యారని, వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు.

స్నానపుగదులు, టాయిలెట్ల వెనకాల పిచ్చిమొక్కలు

ఘటనలు జరిగినప్పుడే..

అధికారులు ఏదైనా ఘటనలు జరిగితే గానీ తేరుకోవడం లేదు. జూలై, ఆగస్టులో ఇద్దరి ప్రాణాలు పోయినప్పుడు హడావుడి చేశారే గానీ, మళ్లీ దృష్టి పెట్టలేదు. అప్పుడు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇండ్లకు పంపించారు. యుద్ధ ప్రాతిపదికన ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. పాడుబడిన బావులను పూడ్చి వేశారు. పాత భవన గదులను కూల్చివేశారు. ఆ సమయంలో పాములు బయటకు రాగా, చంపేశారు. ఆగస్టు 13న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం గురుకులాన్ని సందర్శించి విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీసి, నూతన భవనాన్ని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు పెండింగ్ పనులను పూర్తి చేసి నూతన భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి పాఠశాల నూతన భవనంలో కొనసాగుతున్నా.. ఆ తర్వాత పారిశుధ్య పనులు, పిచ్చిమొక్కల తొలగింపును విస్మరించారు. దీంతో గురుకుల ప్రహరీని ఆనుకొని, నూతన భవనం వెనకాల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. నిరుపయోగంగా ఉన్న స్నానాల గదులు, టాయిలెట్ల వద్ద కూడా పెరిగాయి. దీంతో పాముల సంచారం పెరిగినట్టు తెలుస్తుండగా, పది రోజుల క్రితం ఆవరణలో పాము కనిపించిందని విద్యార్థులు తెలిపారు. గత నెల 27న కిచెన్‌షెడ్‌లో ఎలుకలు సైతం బయటకు వచ్చాయి. తాజాగా, ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో పెద్దాపూర్ గురుకులాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఆవరణంతా కలియతిరుగుతూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించాలని, గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో చుట్టుపక్కల పంచాయతీల నుంచి ట్రాక్టర్లను తెప్పించి పారిశుధ్య సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగిస్తున్నారు. అయితే, ఏదైనా ఘటనలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారని, ఆ తర్వాత నిర్లక్ష్యం చూపుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచితే ఇప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని వాపోయారు.

గురుకులాన్ని మరోచోటుకు తరలించండి
తల్లిదండ్రుల రాస్తారోకో

పెద్దాపూర్ గురుకులాన్ని మరో చోటుకు తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థులు అస్వస్థత చెందిన విషయం తెలిసి గురువారం పెద్దాపూర్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గతంలో ఇద్దరు పిల్లల మృతికి, నలుగురు విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను ఇప్పటికీ ఎందుకు వెల్లడించలేదని ఆర్డీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మాధవీలతను నిలదీశారు. ప్రస్తుతం మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థత చెందారని, దీనికి కారణాలను ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అనంతరం మారుతీనగర్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకొని రాస్తారోకో చేశారు. ప్రమాదపుటంచున పిల్లల చదువులు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనింతటికీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. చివరకు అధికారులు వచ్చి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో సాయంత్రం రాస్తారోకో విరమించారు. కొందరు తమ పిల్లలను ఇండ్లకు తీసుకెళ్లారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఆందోళనకు మద్దతుగా రాస్తారోకోలో పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

బస చేయాల్సిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కూడా ఉండడం లేదు. కేవలం నైట్ కేర్‌టేకర్లు మాత్రమే రాత్రి బస చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై తల్లిదండ్రులు ఆగ్రహిస్తున్నారు. రాత్రి వేళ ఏదైనా జరిగినప్పుడు పిల్లలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి ఉంటున్నదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకుల ఆవరణలో పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెరుగైన వైద్య సేవలు అందించాలి
జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. కోరుట్లలోని ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందుతున్న పెద్దాపూర్ గురుకుల విద్యార్థులు అఖిల్, యశ్విత్‌ను డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఎస్పీ రాములుతో కలిసి గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ చెప్పారు. ఇక్కడ కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేశ్‌బాబు, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీకాంత్, శ్యాంరాజ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎందరిని బలి తీసుకుంటరు?
జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 19 : గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోవడం లేదని, మొద్దు నిద్రలో ఉందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపడ్డారు. అసమర్థతతో.. నిర్లక్ష్యంతో ఇంకెంత మంది పిల్లలను బలి తీసుకుంటారని ప్రశ్నించారు. పెద్దాపూర్ గురుకుల సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దాపూర్ గురుకులంలో ఇప్పటివరకు ఆరుగురు విద్యార్థులు పాముకాటుకు గురైనా ప్రభుత్వం నుంచి కనీసం స్పందన లేదని వాపోయారు. పాముకాటుతో ఇప్పటికే ఇద్దరు విద్యార్థులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా.. ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు భయపడరని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి కొట్లాడుతారని స్పష్టం చేశారు.

రాత్రి బసకు మంగళం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురుకులాన్ని సందర్శించిన సమయంలో ఆయన పలు ఆదేశాలు ఇచ్చారు. నెలలో ఒకసారి కలెక్టర్, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతోపాటు రాత్రి బస చేస్తారని ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి గానీ, ప్రజాప్రతినిధి గానీ ఇక్కడ బస చేసిన పాపానపోలేదు. దీనికి తోడు గురుకులంలోనే

సస్పెన్షన్లతోనే సరి!

ఐదు నెలల క్రితం పిల్లలు మృతి చెందినప్పుడు అప్పటి ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను సస్పెండ్ చేశారు. ఆహారంలో నాణ్యతలోపం, కిచెన్ షెడ్‌లో అపరిశుభ్రత కారణంగా గత నెల 26న ఫుడ్ ఇన్‌చార్జి కిశోర్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేశారు. తాజా, ఘటనలోనూ ప్రిన్సిపాల్ మాధవీలతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల అస్వస్థతపై ఉన్నతాధికారులకు సకాలంలో సమాచారం అందించకపోవడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వేటు వేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు సస్పెండ్ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని, తర్వాత గురుకులంలో విద్యార్థుల సమస్యలను గాలికొదిలేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పాలన చేతగాకే అరెస్ట్‌లు

- తిట్టుడుమాని అభివృద్ధిపై దృష్టి సారించాలి
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- గురుకులం సందర్శనకు వెళ్తుండగా అరెస్ట్

పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న అఖిల్‌ను పరామర్శిస్తున్న విద్యాసాగర్‌రావు

కోరుట్ల, డిసెంబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతగాకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. పాముకాటుకు గురై కోరుట్ల ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందుతున్న పెద్దాపూర్ గురుకుల విద్యార్థులు అఖిల్, యశ్విత్‌ను ఆయన గురువారం పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను పాముకాటు వేయడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం పెద్దాపూర్ గురుకులంలో పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్తుండగా విద్యాసాగర్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం 2.30గంటలకు అరెస్ట్ చేసి కోరుట్ల స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 5 గంటల తర్వాత విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వానికి బాధ్యత గుర్తు చేసేందుకు, గురుకులంలో వాస్తవ పరిస్థితులను నివేదించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఆర్థిక స్థోమత లేకపోతే తామే చందాలు వేసి మౌలిక వసతులు కల్పిస్తామని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు అసక్తి చూపేవారని, ఇంజినీర్లు, డాక్టర్లను అందించిన ఘనత గురుకుల పాఠశాలకు ఉందన్నారు. ఇప్పుడు గురుకులాలు అంటేనే భయపడే రోజులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సుమారు 50 వరకు ఫుడ్‌పాయిజన్, పాముకాటుతో విద్యార్థులు మరణించిన ఘటనలు జరిగాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరవాలని, గురుకులాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు చీటి వెంకట్రావు, దారిశెట్టి రాజేశ్, బట్టు సునీల్, ఫహీం, అతిక్, సురేందర్, కృష్ణంరాజు, అస్లాం, అమేర్, తదితరులు ఉన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ గోశాల

రాజన్న కోడెల స్థితిగతులపై నేటి నుంచి ఆరా

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- పది ఉమ్మడి జిల్లాలకు 20 మంది అధికారుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన దేవాలయ ఈవో • వారంలో సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశం • వాహనాలు లేకుండా ఎలా వెళ్తామంటున్న అధికారులు • 'నమస్తే' కథనాలకు స్పందన

కరీంనగర్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న కోడెల పంపిణీలో అక్రమాలు, కబేళాలకు తరలడం వంటి విషయాలను సీరియస్‌గా తీసుకున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, తాజాగా దేవాలయ అధికారులతో సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అక్రమాలు, పంపిణీ, 'నమస్తే' కథనాలపై ఆరా తీసి, అధికారులపై సీరియస్ అయినట్టు తెలిసింది. నిజానికి కోడెల పంపిణీ కమిటీకి అధ్యక్షుడైన తనకే తెలియకుండా మూడో దశ ఎలా పంపిణీ చేశారని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. ఈ నెల 7న 'రాజన్న కోడెలు కోతకు!?' శీర్షికన మొదలు పెట్టి.. 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా, మంత్రి కొండా సురేఖ సైతం స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి, ఈ నెల 17న కలెక్టరేట్‌లో వేములవాడ ఆలయ, గోశాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. రాజన్న దేవాలయం, గోశాలకు సంబంధించిన కోడెల పంపిణీకి కలెక్టర్ అనుమతి తప్పనిసరి ఉండాలని, అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లో పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో పంపిణీకి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 1,975 పశువులను గోశాల నుంచి పంపిణీ చేశామని, వీటిలో మొదటి దశ 1,278 కోడెలు, 75 ఆవులు, రెండో దశ 389 కోడెలు, 45 ఆవులు, మూడో దశ 188 కోడెలు పంపిణీ చేశామని అధికారులు వివరించారు. మొదటి, రెండు దశలకు మాత్రమే అనుమతి తీసుకున్నారని, మూడో దశ అనుమతి లేకుండా ఎలా పంపిణీ చేశారని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర నివేదిక అందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంపిణీ చేసిన 1,975 పశువుల స్థితిగతులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆ మేరకు నివేదిక సమర్పించేందుకు ఆలయ అధికారులు సిద్ధమవుతున్నారు.

రైతులకు పంపిణీ చేసిన రాజన్న కోడెల స్థితిగతులను తెలుసుకునేందుకు అధికారయంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు ఇప్పటికే రంగంలోకి దిగింది. అందులో భాగంగానే పది ఉమ్మడి జిల్లాలకు ఇద్దరు అధికారుల చొప్పున నియమిస్తూ దేవాలయ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లాలకు కేటాయించిన మొత్తం కోడెల వివరాలు సేకరించి, పూర్తిస్థాయి నివేదికను వారంలో ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే సమగ్ర నివేదిక ఇచ్చిన తర్వాత బిల్లులు సమర్పిస్తే.. నిబంధనల ప్రకారం టీఏ, డీఏలు చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనగా.. వాహనాలు లేకుండా జిల్లాలు తిరగడం ఎలా సాధ్యమవుతుందని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

కలెక్టర్ ఆదేశాలతో మొత్తం 1,975 కోడెల స్థితిగతులను పూర్తిగా పరిశీలించడానికి దేవాలయ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అందులో భాగంగానే ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇద్దరు అధికారుల చొప్పున నియమిస్తూ దేవాలయ ఈవో తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేకాధికారితోపాటు ఒక అసిస్టెంట్‌ను నియమించారు. జూలై 3వ తేదీ నుంచి ఇప్పటి వరకు రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన కోడెల స్థితిగతులు, సంరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తి వివరాలు సేకరించి వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన టీఏ, డీఏ బిల్లులు సమర్పించిన తర్వాత నిబంధనలకు లోబడి చెల్లిస్తామని ఈవో ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అయితే, ముందుగా వాహనాలు లేకుండా ఎలా వెళ్తామని దేవాలయ అధికారులు మాట్లాడుకుంటున్నట్టు తెలుస్తున్నది. కానీ, కలెక్టర్ సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో ఎలాగైనా సరే వెళ్లి క్షేత్రస్థాయి సర్వే చేయాలని మరికొంత మంది అధికారులు పేర్కొన్నట్టు తెలుస్తున్నది.

జిల్లాల వారీగా నియమించిన ప్రత్యేకాధికారులు, అసిస్టెంట్‌లు, వారి హోదా వివరాలు

ఉమ్మడి జిల్లా	విధులు కేటాయించబడిన సిబ్బంది
కరీంనగర్	సహాయ కార్యనిర్వహణాధికారి జీ అశోక్, సీనియర్ అసిస్టెంట్ టీ రాజేశ్వర్‌రావు
మెదక్	పర్యవేక్షకుడు బీ తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ ఎస్ సురేశ్
రంగారెడ్డి	పర్యవేక్షకుడు వీ వెంకటప్రసాద్
ఆదిలాబాద్	పర్యవేక్షకుడు కే సంజీవరావు, సీనియర్ అసిస్టెంట్ బీ శంకర్
ఖమ్మం	పర్యవేక్షకుడు జీ నరసింహమూర్తి జూనియర్ అసిస్టెంట్ పీ లక్ష్మీనరసింహ
నల్లగొండ	పర్యవేక్షకుడు జీ శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ బీ లక్ష్మీనర్సయ్య
మహహబూబ్‌నగర్	పర్యవేక్షకుడు ఆర్ విజయ్‌కుమార్
హైదరాబాద్	పర్యవేక్షకుడు వీ వెంకట ప్రసాద్
నిజామాబాద్	పర్యవేక్షకుడు కే సంజీవరావు, సీనియర్ అసిస్టెంట్ బీ శంకర్
వరంగల్	పర్యవేక్షకుడు వరి నర్సయ్య, జూనియర్ అసిస్టెంట్ గొట్టం రవి

మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

తప్పుల తడకగా ఓటర్ల జాబితా

- ఒక్కొక్కరికి నాలుగైదు చోట్ల ఓట్లు
- ఓటరు జాబితా ప్రకటనకు ముందే చర్యలు చేపట్టాలి
- ఎన్నికల్లో 'వన్ ఆధార్.. వన్ ఓట్' అమలు చేయాలి
- రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, డిసెంబర్ 19 : ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఓటరు జాబితా తప్పుల తడకగా మారిందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. ఎన్నికల అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'వన్ ఆధార్.. వన్ ఓటు' విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటు నమోదును ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే ఒక్కరికే నాలుగు నుంచి ఎనిమిది వరకు ఓట్లు కనిపించాయని ఆరోపించారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో వేల సంఖ్యలో ఓట్లు ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. ఒకే ఆధార్ నంబర్‌పై అనేక ఓట్లు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వీటన్నింటితో ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వీటిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు లిస్టు ప్రకటనకు ముందే ఒకే ఆధార్ నంబర్‌తో నమోదైన ఎక్కువ ఓట్లను గుర్తించి, తొలగించాలని డిమాండ్ చేశారు. ఒక ఆధార్‌తో ఎక్కువ సంఖ్యలో ఓట్లు ఎలా ఎన్‌రోల్‌మెంట్ అయ్యాయో అర్థం కావడం లేదన్నారు. కొందరు కుట్ర పూరితంగానే అప్లయి చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అనే నినాదంతో దేశం ముందుకు పోతుంటే.. మరి 'ఒకే ఆధార్.. ఒకే ఓటు' ఎందుకు తీసుకోవడం లేదన్నారు. ఎన్నికల అధికారులు ఆధార్‌ను ప్రామాణికంగా తీసుకొని ఓటరు జాబితా పరిశీలన చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పొన్నం అనిల్ గౌడ్, పెండ్యాల మహేశ్‌కుమార్, గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, కొమురయ్య, పరశురాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.